నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, బుధవారం 5 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న అధికారులు

కందనూలు హస్తగతం

- 94,414 ఓట్ల మెజార్టీతో మల్లు రవి విజయం

విజయోత్సవ సంబురాల్లో మల్లు రవి

నాగర్‌కర్నూల్, జూన్ 4(నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లు రవి విజయం సాధించారు. గతనెల 13 వ తేదీన జరిగిన ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. నెల్లికొండ మార్కెట్‌యార్డులోని స్ట్రాంగ్ రూం వద్ద ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంను తెరవగా.. ఉదయం 8గంటలకే కౌంటింగ్‌ను ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు రవి, బీజేపీ అభ్యర్థిగా భరత్ ప్రసాద్‌తో పాటు మొత్తం 19మంది పోటీ చేశారు. ఈ ఫలితాల్లో తొలి నుంచి ఆధిక్యంలో ఉన్న మల్లు రవి 94,414 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పార్లమెంట్ పరిధిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, జోగులాంబ గద్వాల, అలంపూర్, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,38,254 మంది ఓటర్లు ఉండగా 69.46శాతంతో 12,07,471 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లలోనూ కాంగ్రెస్‌కు అత్యధికంగా 5,813 ఓట్లు, బీజేపీకి 5,760, బీఆర్ఎస్‌కు 2,127, ఇతరులకు 511, నోటాకు 69ఓట్లు వచ్చాయి. మొత్తం 22రౌండ్లలో లెక్కింపు జరుగగా చివరి రౌండ్ ఫలితాల ప్రకారం మల్లు రవికి 4,65,072 ఓట్లు పోలయ్యాయి. రెండోస్థానంలో నిలిచిన భరత్‌ప్రసాద్‌కు 3,70,658 ఓట్లు, మూడోస్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్‌పీకి 3,21,343 ఓట్లు వచ్చాయి. ఇతర అభ్యర్థులకు 58,625ఓట్లు పోలవ్వగా.. నోటాకు 4,969 ఓట్లు వచ్చాయి. ఎంపీగా గెలిచిన మల్లు రవికి ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంత మెజార్టీ ఊహించలేదు.. : మల్లు రవి

నాగర్‌కర్నూల్, జూన్ 4 : ఇంత మెజార్టీ ఊహించలేదని.. తనను గెలిపించిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎంపీ మల్లు రవి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో కలిసి నల్లవెల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా కౌంటింగ్ కేంద్రానికి వెళ్లి మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న డీకే అరుణ

పాలమూరులో కమల వికాసం

- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు షాక్
- మొన్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, నేడు ఎంపీ స్థానాల్లో చుక్కెదురు
- నాగర్‌కర్నూల్‌లో డీలా పడిన బీజేపీ
- ఎన్ని కుట్రలు చేసినా నా గెలుపును ఆపలేక పోయారు : డీకే అరుణ

మహబూబ్‌నగర్, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'నేను ఈ జిల్లా బిడ్డను.. నన్ను కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని చేసింది.. బీజేపీ, బీఆర్ఎస్‌ను తొక్కి పార్లమెంట్‌కు వెళ్తాం..' అంటూ శపథం చేసిన సీఎంకు పాలమూరు ప్రజలు షాక్ ఇచ్చారు. అభ్యర్థుల గెలుపు కోసం స్వయంగా ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకొని తిరిగినా కనికరించలేదు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన అధికార పార్టీ.. సొంత గడ్డపై పార్లమెంట్ స్థానాన్ని కోల్పోయింది. చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంతో సరిపెట్టుకున్నది. సొంత జిల్లాలో వరుస ఓటములతో సీఎం రేవంత్ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నా పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. దీంతో కాంగ్రెస్ కోటలో కమలం పాగా వేసింది. ఉత్కంఠభరిత పోరులో పాలమూరు పార్లమెంట్ అభ్యర్థిగా డీకే అరుణ తన సమీప ప్రత్యర్థి (కాంగ్రెస్ అభ్యర్థి) చల్లా వంశీచంద్‌రెడ్డిపై కేవలం 4,500 స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. అటు నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌పై 94,414 భారీ మెజార్టీతో విజయం సాధించారు. కాగా కందనూలు పార్లమెంట్‌లో పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చివరివరకు పోరాడి ఓడారు. పాలమూరులో మాత్రం బీఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలో హస్తం, కమలం చెరో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మంగళవారం ఉమ్మడి జిల్లాలో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి పాలమూరు యూనివర్సిటీలో.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు సంబంధించి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు ఆయా రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు 5,10,747 ఓట్లు రాగా చల్లా వంశీచంద్‌రెడ్డికి 5,06,247.. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 1,54,792 ఓట్లు వచ్చాయి. కందనూలు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి 4,65,072 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు 3,70,658.. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 3,21,343 ఓట్లు వచ్చాయి. కాగా మల్లు రవి 94,414 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పాలమూరు ఫలితం చివరి వరకు ఉత్కంఠ రేపగా బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు.

మొన్న ఎమ్మెల్సీ ఇవాళ ఎంపీ..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక ఎమ్మెల్సీ, ఎంపీ స్థానాన్ని చేజేతుల కోల్పోయింది. సాక్షాత్తు సీఎం సొంత జిల్లాలోనే అధికార పార్టీకి ఓటర్లు ఎదురు తిరిగారు. 12మంది ఎమ్మెల్యేలున్నా రెండు స్థానాలను కోల్పోవడంతో ఆ పార్టీ నేతలను కోలుకోలేని దెబ్బ పడింది. మరోవైపు ముదిరాజ్ కోటాలో మక్తల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తామని స్వయంగా సీఎం చెప్పినా జనం వారి మాటలను నమ్మలేదు. మక్తల్ నియోజకవర్గంలోనే బీజేపీకి 8,500 మెజార్టీని కట్టబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో 27వేల మెజార్టీ రాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీని అందించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా సైలెంట్ అయిపోయారు. తన ఓటమికి కాంగ్రెస్ పార్టీలోని ఒక సెక్షన్ పని చేసిందని వంశీచందర్‌రెడ్డి ఢిల్లీలోని ఏఐసీసీ నాయకులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పరోక్షంగా సీఎం సోదరుడిపై ఆయన ఆరోపణలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

పాలమూరులో బీజేపీ.. కందనూలులో కాంగ్రెస్..

పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా ప్రజలు విభిన్న తీర్పునిచ్చారు. పాలమూరు ఎంపీ స్థానంపై అధికార పార్టీ ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఎలాంటి క్యాడర్ లేని బీజేపీకే ప్రజలు పట్టం కట్టారు. కాగా నాగర్‌కర్నూల్‌లో మాత్రం కాంగ్రెస్ పార్టీకి భారీ విజయాన్ని అందజేశారు. రెండుస్థానాల్లో వెలువడిన విభిన్న తీర్పు ఆయా రాజకీయ పక్షాలను షాక్‌కు గురి చేసింది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా.. ఈసారి మూడోస్థానానికి పరిమితమయ్యారు.

పోరాడి ఓడి

కందనూలు ఎంపీ స్థానానికి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోరాడి ఓడారు. సివిల్ సర్వీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆర్ఎస్‌పీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు కుదుర్చుకున్నాక పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆర్ఎస్‌పీ బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి ఆర్ఎస్‌పీని అభ్యర్థిగా ఖరారు చేశారు. ఆర్ఎస్‌పీ అలంపూర్ సొంత నియోజకవర్గం కావడం.. గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండడంతో పార్లమెంట్ స్థానంపై గురిపెట్టారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోయారు. ఎంపీగా తనను గెలిపిస్తే కందనూలు అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇవ్వడంతో అధికార పార్టీ సహా బీజేపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయి. చివరకు ధన బలం, అధికార పార్టీ ఒత్తిళ్లు.. బాగా చదివి సివిల్ సర్వీసెస్‌లో ఉన్న అభ్యర్థిని గెలిపిస్తే తమకు పుట్టగతులుండవని తెర వెనుక కుట్రలకు పాల్పడ్డారు. ప్రచారంలో దూసుకెళ్తున్న ఆర్ఎస్‌పీకి వచ్చిన జన ప్రభంజనాన్ని చూసిన రెండు పార్టీలు ఏకమై ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులను వెదజల్లాయి. దీంతో ఆర్ఎస్‌పీ గెలుపు అంచు వరకు వచ్చి ఓటమి పాలయ్యారు.

వంశీకి పుట్టినరోజునే షాక్..

కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి పుట్టినరోజు నాడే పాలమూరు ఓటర్లు షాకిచ్చారు. కౌంటింగ్, బర్త్ డే ఒకే రోజు రావడంతో ఆయనకు పార్టీ నేతలు విజయాన్ని కానుకగా ఇద్దామని భావించారు. కానీ ఓటర్లు మాత్రం కనికరించకపోవడంతో పుట్టినరోజు నాడే ఓటమిని చవిచూశారు. గెలిస్తే జన్మదినం, గెలుపు సంబురాలు చేద్దామనుకున్న నేతలను ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఓటమిపై ఆ పార్టీ నేతలు మీడియా ముందుకు రాకపోవడం గమనార్హం. మొత్తంగా ఉమ్మడి జిల్లా ప్రజలు ఎంపీ ఎన్నికల్లో విభిన్న తీర్పునిచ్చారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

విద్యార్థులతో కలిసి విజయకేతనం చూపుతున్న రిషి కళాశాల యాజమాన్యం

జాతీయస్థాయిలో 'రిషి' విజయభేరి

పాలమూరు, జూన్ 4 : నీట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో విజయభేరి మోగించారు. కె.అనన్య 627 (720 మార్కులకు) మార్కులు సాధించి మొదటి స్థానాన్ని సాధించిందని కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రకళావెంకట్, సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఇ.మౌనిక 621, ఎండీ సఫాన్‌సాద్ 610, ఏ.సంతోష్‌కుమార్ 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించినట్లు యాజమాన్యం తెలిపింది. అదేవిధంగా 600 మార్కులకు పైగా నలుగురు, 550 మార్కులకు పైగా 21 మంది, 500 మార్కులకు పైగా 54 మంది, 450 మార్కులకు పైగా 126 మంది, రిజర్వేషన్ కేటగిరీల్లో కలిపి 165మంది విద్యార్థులు మెడికల్ సీట్లు పొందేందుకు అర్హత సాధించడం గర్వంగా ఉందని కళాశాల యాజమాన్యం పేర్కొన్నది. అదేవిధంగా జిల్లాలో అత్యధిక సీట్లు సాధించిన సంస్థగా రిషి చరిత్ర సృష్టించిందన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

నీట్‌లో వాగ్దేవి విజయకేతనం

పాలమూరు, జూన్ 4 : నీట్ యూజీ ఫలితాల్లో పాలమూరులోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించి సాధారణ విద్యార్థులను సైతం డాక్టర్లుగా మార్చిన ఘనత వాగ్దేవి కళాశాలదే అని అన్నారు. ఇంతటి ఘనవిజయంలో అధ్యాపకుల కృషి ఎనలేనిదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చి వారి కలను నిజం చేసిన ఘనత తమ కళాశాలకే దక్కుతుందన్నారు. 45 మందిలో 30 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ జ్యోతీనందన్‌రెడ్డి, అకాడమీ అడ్వైజర్ యాకూబ్, ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి చెన్నయ్య, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్ తదితరులు ఉన్నారు.

నీట్‌లో 'అక్షర' ప్రభంజనం

సనాఫాతిమా

పాలమూరు, జూన్ 4 : నీట్ యూజీ ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని అక్షర జూనియర్ కళాశాల విద్యార్థి సనా ఫాతిమా 552మార్కులు (720 మార్కులకు) సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా మరో నలుగురు విద్యార్థులు కూడా ఎంబీబీఎస్ సీట్లు సాధించేందుకు అవసరమైన మార్కులు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సనా ఫాతిమాను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మంగళవారం శాలువా తో సన్మానించి అభినందించారు.

సాగుకు సిద్ధం

పొలాన్ని సిద్ధం చేసిన రైతులు

- జోగులాంబ గద్వాల జిల్లాలో పెరగనున్న సాగు విస్తీర్ణం
- అధికశాతం రైతులు పత్తిసాగు వైపే..
- ఎరువులు, విత్తనాలకు సంబంధించి ప్రణాళికలను ప్రభుత్వానికి పంపిన అధికారులు

గద్వాల, జూన్ 4 : రైతులు వానకాలం సాగుపై కొండంత ఆశతో పొలాలను సిద్ధం చేస్తున్నారు. గత వానకాలం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి సన్నద్ధమవుతున్నారు. గత వానకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు అనుకున్న స్థాయిలో దిగుబడి సాధించలేకపోయారు. దీంతో ప్రస్తుతం బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వేసవిలో కూడా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు పొలాలను దుక్కి దున్ని విత్తేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సాగుకు సంబంధించి వ్యవసాయ అధికారులు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. సాగు నీరు పుష్కలంగా ఉండడంతో ఈసారి సాగు ఎక్కువ విస్తీర్ణంలో చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తుమ్మిళ్ల, ఆర్డీఎస్, జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టులే కారణం. ఎగువన వర్షాలు కురిస్తే ఈ ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటాయి. ఫలితంగా ఆ నీటిని రిజర్వాయర్లలోకి పంపింగ్ చేసి అక్కడి నుంచి చెరువులు నింపడంతో వాటికింద ఆయకట్టు కొంతమేర పెరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. దీనికి తోడు బోరుబావులలోనూ నీటిశాతం పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఎరువులను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. విత్తేనాటికి రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధం చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ప్రస్తుతం జిల్లాలో ఎరువుల కొరత లేకున్నా విత్తనాల కొరత వేధిస్తున్నది. అధికారుల అవసరమైన ఇండెంట్‌ను పెట్టగా ఇప్పటి వరకు జిల్లాకు కేవలం 650 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. వర్షాలు కురిస్తే రైతులకు విత్తన సమస్య తలెత్తే అవకాశం ఉన్నది. రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం గోదాంలో అందుబాటులో ఉంచుతుండడంతో రైతులు ధీమాగా సాగుకు సన్నద్ధమవుతున్నారు. తొలకరి పులకరిస్తే రైతులు సాగు పనుల్లో నిమగ్నం కానున్నారు. గత ప్రభుత్వం ఐదువేల ఎకరాలకో క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను కేటాయించింది. ఇది కూడా సాగు పెరగడానికి ఒక కారణం.

ప్రధాన పంటలు సాగు..

జిల్లా రైతులు వానకాలంలో ఎక్కువగా పత్తి, వరి, వేరుశనగ, పెసర, మొక్కజొన్న, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు, అనుములు, మిర్చి, ఉల్లి పంటలను సాగు చేస్తారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని 13 మండలాల్లో సాగుకు సంబంధించి ప్రణాళికలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. గత వానకాలంలో జిల్లాలో 1,48,156 హెక్టార్లలో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. కాగా ఈ వానకాలంలో 1,70,379 హెక్టార్లలో సాగు చేస్తారని అధికారుల అంచనా. అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్టు జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్ తెలిపారు.

పంటల సాగు ఇలా..

జిల్లాలోని పంటలు సాగు వివరాలు ఇలా ఉన్నాయి. 68,046 హెక్టార్లలో పత్తి పంట సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత వానకాలంలో 59,170హెక్టార్లలో సాగు చేశారు. గతేడాది వరి పంట 32,830 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 37,755 హెక్టార్లలో సాగు చేయనున్నారు. కందులు గతేడాది 9,130 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 10,500 హెక్టార్లలో.. మొక్కజొన్న గతేడాది 5,310 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 6, 107, వేరుశనగ గతేడాది 3,060హెక్టార్లలో చేయగా ఈ ఏడాది 3,519హెక్టార్లలో సాగు చేయస్తున్నట్లు అంచనా వేశారు. మిర్చి పంట గత వానకాలంలో 26,380 హెక్టార్లలో సాగు చేయగా ఈ వానకాలం 30,337 హెక్టార్లలో సాగు చేయనున్నారు. ఆయిల్ సీడ్స్‌కు సంబంధించి గతేడాది 9,840 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 11,316 హెక్టార్లు, ఆముదం గత వానకాలం 590 హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 679హెక్టార్లలో సాగు చేస్తారని అంచనా వేశారు. పొగాకు గత వానకాలంలో 990 హెక్టార్లలో.. ఈ వానకాలం 1,130హెక్టార్లలో, ఇతర పంటలు 985 హెక్టార్లలో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు.

ఎక్కువ శాతం పత్తి వైపే..

పత్తికి ప్రభుత్వం గరిష్ఠంగా మద్దతు ధర ఇస్తుండగా.. మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుండడంతో రైతులు పత్తి సాగుపై మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కేవలం నల్లరేగడిలో మాత్రమే పత్తి పంట సాగు చేయాలని సూచిస్తున్నా రైతులు మాత్రం అన్ని రకాల పొలాల్లో పత్తి పంటను సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. గతేడాది ఇక్కడున్న నీటి వనరులు, మద్దతు ధరను అంచనా వేసుకొని 59,170 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది వానకాలంలో సుమారు 68,046 హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అధికారుల అంచనా. ఈ వానకాలంలో రైతులు అదనంగా 8,876 హెక్టార్లలో సాగు చేయనున్నారు.

ఎరువులు సిద్ధం..

రైతులకు సరిపడా ఎరువులను అధికారులు సిద్ధంగా ఉంచారు. ఈ వానకాలానికి 1,13,922 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. అందులో యూరియా 35,134 మెట్రిక్‌టన్నులు, డీఏపీ 12,919, ఎంఓపీ 5,944, సూపర్ 4,073, ఏఎస్ 2,670, కాంప్లెక్స్ ఎరువులు 53,173 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు. రైతులు మొదటి విడుతలో మందులు చల్లుకోవడానికి అవసరమైన నిల్వలను ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది.



పంట పొలాల్లో ఆరుద్ర పురుగుల సందడి

కాలం కలిసొచ్చినట్లే..

- విరివిగా కనిపిస్తున్న ఆరుద్ర పురుగులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఔషధ తయారీలో 'ఆరుద్ర పువ్వులు' వినియోగం
- రసాయనాల పిచికారీతో కనుమరుగు
- సంరక్షణ చర్యలు చేపట్టాలంటున్న నిపుణులు

గద్వాల టౌన్, జూన్ 4 : చూడగానే ముద్దొచ్చే రూపం.. ఎర్రని తివాచీ సున్నితత్వం.. ముట్టుకుంటే మాసిపోతాయేమోననిపించే అందం.. దానికి తోడు ఆపన్న హస్తాన్ని అందించడంలో వీటికి సాటిదీ లేదనడంలో అతిశయోక్తి లేదు.. అవేంటబ్బా అని ఆలోచిస్తున్నారా? అవేనండీ.. మన రైతునేస్తాలైన ఆరుద్ర పురుగులు.. వానలు ప్రారంభం కావడంతో ఈ పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. కాలం కలిసొచ్చినట్లేనని, పంటలు బాగా పండుతాయని సంబురపడిపోతున్నారు. కీటక జాతికి చెందిన ఆరుద్ర పురుగులను 'మినుగులు', 'ఆరుద్ర పువ్వులు' అని పిలుస్తారు. కీటకాలను చూస్తేనే ఆమడదూరం పారిపోయేవారు సైతం వీటిని పట్టుకోకమానరు. తొలకరి వర్షాల అనంతరం 15 రోజులకు వచ్చే కార్తె ఆరుద్ర కార్తె.. కానీ ఈ కార్తె రాక ముందే ఆరుద్ర పురుగులు రైతులను మురిపింపజేస్తున్నాయి. వీటికి, రైతులకు అవినాభావ సంబంధం ఉంది. మినుగులు విరివిగా కనిపిస్తే ఆ ఏడాదంతా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయన్న నమ్మకం అన్నదాతల్లో ఉన్నది. అందుకే నాటి నుంచి నేటి వరకు ఆరుద్ర పువ్వుల ఆగమనాన్ని రైతులు శుభపరిణామంగా భావిస్తారు.

రైతుకు మేలు చేసే ఆరుద్ర..

అందానికే కాదు.. ఆపన్న హస్తాన్ని అందించడంలో తనకు సాటి మరెవరూ లేరని ఆరుద్ర మురిసిపోతుంది. తొలకరి దుక్కుల్లో పంటనాశన కీటకాలను ఈ మినుగులు నాశనం చేస్తాయి. పంటను నాశనం చేసే కీటకాలతోపాటు వాటి గుడ్లను సైతం ఇవి తినేయడంతో మొక్కలు బలంగా ఎదిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. అన్నదాతకు తెలియకుండానే ఆయన కష్టాలను పాలుపంచుకుంటూ పంటను కాపాడుతుంది.

మందుల తయారీలోనూ..

ఆరుద్ర పువ్వులను ఆయుర్వేదిక్ మందుల తయారీలోనూ ఉపయోగిస్తారు. పురుగుల ద్వారా తీసే నూనెను హెర్బల్ మెడిసిన్, వివిధ ఔషధాల్లోనూ వినియోగిస్తారు. పాన్‌మసాలా తయారీలోనూ ఈ నూనెను వాడతారు.

కనుమరుగవుతున్న ఆరుద్ర..

మనిషి స్వార్థం కోసం విచ్చలవిడిగా ఎరువులు, రసాయనాలను వాడుతూ పుడమి తల్లిని కాలుష్యం చేస్తున్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు చేసే కీటక జాతి అంతరించి పోతున్నది. అందులో ఒకటి ఆరుద్ర పురుగు. కొన్ని ప్రాంతాల్లో ఈ పురుగులకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో వాటిని సేకరించి విక్రయించిన ఘటనలూ ఉన్నాయి. ఈ పురుగులను 2017, 18 సంవత్సరాల్లో ఇతర దేశాలకు స్మగ్లింగ్ చేశారన్న వార్తలొచ్చాయి. రైతులకు లాభసాటి పంటలను అందించడంలో తోడుండే ఆరుద్ర పురుగులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

లైసెన్స్ ఉన్న షాపుల్లోనే కొనాలి..

జిల్లా వ్యవసాయశాఖ పరిధిలోని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతుల అవసరాల మేరకు సిద్ధంగా ఉంచాం. ఎరువులు, విత్తనాలను కొనేటప్పుడు తప్పనిసరిగా దుకాణదారుల నుంచి రసీదులు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులు విత్తనాలు అమ్మడానికి గ్రామాల్లోకి వస్తే ఎవరూ కొనుగోలు చేయవద్దు. అటువంటి వ్యక్తుల సమాచారం మాకు ఇవ్వాలి. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. నాసిరకం విత్తనాలు కొని మోసపోవద్దు.

- గోవిందునాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, జోగులాంబ గద్వాల